వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 053
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
ఫిబ్రవరి 05, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



2లో..

## ఓరుగల్లు ఖ్యాతిని చాటేలా.. మహా శివరాత్రి వేడుకలు

ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి




# సర్పంచ్‌లకు గుడ్ న్యూస్

వివరాలు 2లో..

రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం గురువారం గుడ్ న్యూస్ అందించింది. ఎప్పటి నుంచో గ్రామ పంచాయతీలకు రావాల్సిన బకాయిలకు సంబంధించి ప్రకటన వెలువరించింది. గ్రామాల అభివృద్ధికి కీలకమైన 15వ ఆర్థిక సంఘం నిధులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రెండేళ్లుగా నిధుల కోసం ఎదురుచూస్తున్న గ్రామ పంచాయతీలకు ఇది కీలక పరిణామంగా మారింది. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయడంతో పాటు, పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు కూడా కేంద్ర శాఖలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. వీరి సమష్టి ప్రయత్నాల ఫలితంగా నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే 15వ ఆరిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి మొత్తం సుమారు రూ.3,000 కోట్ల నిధులు రావాల్సి ఉండగా తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల చేసింది. దీంతో గ్రామ సర్పంచ్‌ల ఆశలు చిగురించాయి. మిగిలిన పెండింగ్ నిధులు కూడా దశలవారీగా విడుదల చేసి గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని కోరుతున్నారు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

- 15వ ఆర్థిక సంఘం నిధులకు మోక్షం
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం
- తొలి విడతలో భాగంగా రూ.259.36 కోట్లు విడుదల
- నేరుగా జీపీ అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్
- తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యానికి వినియోగించే ఛాన్స్

8లో..



## మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరైన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
మొదటి రోజు ఆదాయం రూ. 2.50 కోట్లు



2లో..

## బీజేపీతోనే పట్టణ పురోగతి

- పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- నర్సంపేటలో జోరుగా ఎన్నికల ప్రచారం



2లో..

## బాల కుమారస్వామి జాతరలో మంత్రి సీతక్క

మరమ్మతు పనులకు శంకుస్థాపన

# సర్పంచ్‌లకు.. గుడ్ న్యూస్




- 15వ ఆర్థిక సంఘం నిధులకు మోక్షం
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం
- తొలి విడతలో భాగంగా రూ.259.36 కోట్లు విడుదల
- నేరుగా జీపీ అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్
- తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యానికి వినియోగించే ఛాన్స్

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో, తెలంగాణలోని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. సర్పంచుల పదవీకాలం జనవరి 31, 2024తో ముగియడంతో, ఫిబ్రవరి 1, 2024 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. 12,769 గ్రామ పంచాయతీల్లో పరిపాలన పరమైన ఇబ్బందులు లేకుండా ఉండేందుకు క్లస్టర్ గ్రామాలుగా విభజించి, ఒక అధికారికి కొన్ని పంచాయతీల బాధ్యతలను ప్రభుత్వం తాత్కాలికంగా అప్పగించింది. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడంతో 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై సుప్రీంకోర్టు తీర్పు, ఆపై ఎన్నికల జాప్యం ఈ నిధుల నిలిపివేతకు ప్రధాన కారణాలయ్యాయి. ఎన్నికలు పూర్తయిన తరువాతే నిధులు విడుదల చేస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించడంతో గ్రామ పంచాయతీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

## సర్పంచ్‌లు ఉంటేనే..

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్రంపై నిరంతరంగా ఒత్తిడి తెచ్చారు. ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో పాటు పలువురు కేంద్ర పెద్దలను పలుమార్లు కలిశారు. రాష్ట్రంలో గ్రామాభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. అయితే, కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు (సర్పంచ్‌లు) ఉంటేనే 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి బదిలీ చేస్తారు. ఈ నిబంధనతో నిధుల విడుదలకు కేంద్ర నో చెప్పింది.
మార్చి 31లోపు నిధులు విడుదల కాకపోతే అవి శాశ్వతంగా రద్దయ్యే ప్రమాదం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. అనుకున్నట్టుగానే ఎన్నికలను నిర్ణీత సమయంలో ముగించేందుకు మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపారు. శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి, కేంద్రంతో నిరంతర సంప్రదింపులు కొనసాగించారు.

## నిధులకు మోక్షం..

ఈ క్రమంలోనే కొన్ని రోజుల క్రితం రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించింది. దీంతో గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు కొలువుదీరాయి. అయితే కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు.. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేర్చుదామంటే ఖజానా ఖాళీగా ఉండటంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఈ క్రమంలో మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయడంతో పాటు, పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు కూడా కేంద్ర శాఖలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ చూపి.. కేంద్ర ఆర్థిక శాఖతో సంప్రదింపులు జరపడంతో ఈ నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. ఈ సమష్టి ప్రయత్నాల ఫలితంగా నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి మొత్తం సుమారు రూ.3,000 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉండగా తొలి విడతగా రూ.259.36 కోట్ల విడుదల చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇంతకాలం నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఈ నిధులు కొత్త ఊపిరి పోయనుంది. ఈ నిధులను నేరుగా గ్రామ పంచాయతీ అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. వీటిని గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు వినియోగించాల్సి ఉంటుంది. గ్రామాల్లో తాగు నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతర అవసరాల కోసం ఖర్చు చేయనున్నారు.

# ఓరుగల్లు ఖ్యాతిని చాటేలా.. మహా శివరాత్రి వేడుకలు

### ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట :** ఓరుగల్లు వైభవాన్ని, శివతత్వాన్ని చాటే విధంగా ప్రతీ ఏటా ఏనుగుల రాకేష్ రెడ్డి సారథ్యంలోని ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ, హయగ్రీవ చారి గ్రౌండ్స్ లో నిర్వహిస్తున్న మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం కార్యక్రమం కరపత్రికను గురువారం హరిత హోటల్ లో భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకులు, బ్రహ్మశ్రీ శేషు అయ్యగారు, ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ వరంగల్ జిల్లా అధ్యక్షులు జైపాల్ రెడ్డి సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భద్రకాళి శేషు మాట్లాడుతూ.. ఓరుగల్లు ఒక ఆధ్యాత్మిక కేంద్రం అన్నారు. దేశం మొత్తంలో పంచాత్మక లింగాలున్న ఏకైక నగరంగా ఓరుగల్లుకు ప్రత్యేక విశిష్ఠత ఉందన్నారు. ఈ విశిష్ఠతను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాకేష్ రెడ్డి చేస్తున్న ఈ ప్రయత్నం దిగ్విజయంగా సాగడానికి ఆ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. 400 ఏళ్లపాటు కాకతీయ రాజదానిగా విలసిల్లిన ఈ నగరం శివతత్వానికి కేంద్రం అన్నారు. ఈ ప్రాంత విశిష్ఠతను చాటి చెప్పేందుకే ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం గత ఆరు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఆర్జిల్లా కార్యదర్శి ఎలగందుల రాజు, కార్పొరేటర్ రవి నాయక్, ప్రముఖ యోగ గురువు పోషాల శ్రీనివాస్, ఇండస్ ఫౌండేషన్ కార్యదర్శి పురుషోత్తం యాదవ్, మహాశివరాత్రి కార్యక్రమ నిర్వాహకులు కత్తుల అభిషేక్, సుకాంత్, దీపక్, అఖిల్ రెడ్డి, అయినవోలు సర్పంచ్ గడ్డం రఘువంశి, సోమదేవరపల్లి సర్పంచ్ కృష్ణమూర్తి, కొమురయ్య, కొడారి రవి, సుమన్ గౌడ్, గువ్వ రాజేష్, రవీందర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, వంశీ, రాజేందర్, పిన్నింటి విజయ్, వైనాల నరేష్, బోడ విజయ్, లక్ష్మణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# బాల కుమారస్వామి జాతరలో మంత్రి సీతక్క

### మరమ్మతు పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు మండలం అంకన్నగూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన బాలకుమారస్వామి జాతరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి జాతరను ప్రారంభించారు. అనంతరం రూ.5 లక్షల పంచాయతీ రాజ్ శాఖ నిధుల్లో చేపట్టిన ఆలయ మరమ్మతులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలకుమారస్వామి జాతరకు రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, సీసీ రోడ్లతోపాటు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. బాలకుమారస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, ఆయా ప్రాంతాల గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామస్థులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే పట్టణ పురోగతి

### పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
### నర్సంపేటలో జోరుగా ఎన్నికల ప్రచారం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట మున్సిపాలిటీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నర్సంపేట మున్సిపల్ పరిధిలోని 2, 19, 20, 21, 22, 23, 24వ వార్డుల్లో స్థానిక కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు మైస శోభన్, సూత్రపు సరిత, పుష్ప, బాల్నే శైలజ జగన్, కోమండ్ల సప్తగిరి, గూడూరు సందీప్ లను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. బీజేపీ అభ్యర్థుల మద్దతుగా ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలతో మున్సిపాలిటీ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఓటర్లు తమ అమూల్యమైన ఓటును బీజేపీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని గంట రవికుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ప్రబారి రావు పద్మ, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా, మండల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం



### □ ఐదు ట్రాక్టర్లు సీజ్.. ఏడుగురిపై కేసులు

**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. నెల్లికుదురు మండల పరిధిలోని బ్రాహ్మణకొత్తపల్లి ఆకేరు వారు నుంచి అనధికారింగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై ఎస్సై చిర్ర రమేష్ ఆధ్వర్యంలో గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇందుకు బాధ్యులైన ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో కలిపి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, ఫిబ్రవరి 05, 2026

# వరంగల్ బస్సు టెర్మినల్ పనుల్లో వేగం పెంచండి

◆ కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పాయ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని ప్రతిష్టాత్మక వరంగల్ బస్సు టెర్మినల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కుడా వైస్ చైర్మన్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కుడా కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే వారం నాటికి కాంక్రీట్ పోరింగ్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని, నిర్మాణ పనుల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న కమిషనర్, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు సూచనలు చేశారు. నిర్మాణ సమయంలో కార్మికుల మరియు పరిసర ప్రాంతాల భద్రత విషయంలో రాజీ పడకూడదని, అన్ని సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. "నగర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంలో ఈ టెర్మినల్ కీలక పాత్ర పోషిస్తుంది. అధికారులు సమన్వయంతో పనిచేసి గడువులోగా దీనిని అందుబాటులోకి తీసుకురావాలని చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. ఈ సమావేశంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి, సంబంధిత కాంట్రాక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత దంత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆధ్యాత్మిక సేవతో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక సాయిబాబా మందిరంలో గురువారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో సుమారు 78 మంది భక్తులకు దంత వైద్య నిపుణురాలు డాక్టర్ సృజన సంతోష్ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన సంతోష్ మాట్లాడుతూ, నేటి జీవనశైలిలో దంత సంరక్షణ అత్యవసరమని పేర్కొన్నారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం, మిఠాయిలకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్న దంత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే అవి భవిష్యత్తులో తీవ్ర రూపం దాలుస్తాయని హెచ్చరించారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ మాట్లాడుతూ, భక్తుల సౌకర్యార్థం ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మికతతో పాటు భక్తుల ఆరోగ్యాన్ని కాపాడటమే తమ లక్ష్యమని తెలిపారు. ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, మందిరంలో ప్రతి నెల మూడు గురువారాలు క్రమం తప్పకుండా వివిధ రకాల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శృతి, ఆలయ సిబ్బంది సాయి కృష్ణ రాజు పాల్గొని శిబిరం సజావుగా సాగేలా పర్యవేక్షించారు. ఉచిత నాణ్యమైన వైద్య సేవలపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎన్నికల నిఘా కట్టుదిట్టం

చెక్ పోస్టులను తనిఖీ చేసిన డీసీపీ అంకిత్ కుమార్



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పరకాల పట్టణ సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరకాల మున్సిపల్ పరిధిలోని నాలుగు ప్రధాన మార్గాల్లో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ ఏర్పాటు చేసిన నిఘా కేంద్రాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. హన్మకొండ మార్గం, హుజురాబాద్ మార్గం, చలివాగు బ్రిడ్జ్ ప్రాంతం, వెల్లంపల్లి మార్గాలలో తనిఖీల సందర్భంగా డీసీపీ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న తీరును, రిజిస్టర్లలో నమోదు చేస్తున్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అక్రమ మద్యం, నగదు రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీలు నిర్వహించేటప్పుడు ప్రజలకు ఇబ్బంది కలగకుండా, నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డీసీపీ వెంట పరకాల ఏసీపీ సతీష్ బాబు, ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవం

• అదానీ గ్రూప్ సహకారంతో స్మార్ట్ టీవీల పంపిణీ



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆధునిక సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ములుగు జిల్లాలో డిజిటల్ విద్య విస్తరిస్తోంది. గురువారం ములుగు జిల్లా పరిధిలోని ఎంపీయూపీఎస్ గౌస్‌పల్లి పాఠశాలలో అదానీ గ్రూప్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అందజేసిన స్మార్ట్ టీవీని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. దృశ్య-శ్రవణ పద్ధతుల ద్వారా పాఠ్యాంశాలను బోధించడం వల్ల విద్యార్థులకు విషయాలు సులభంగా అర్థమవ్వడమే కాకుండా, ఎక్కువ కాలం గుర్తుంటాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి వనరుల కల్పన వల్ల అభ్యసన నైపుణ్యాలు మెరుగుపడతాయని ఆయన ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖాధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో అమలు అవుతున్న "Learn to Read English in 90 Days" కార్యక్రమానికి ఈ స్మార్ట్ టీవీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గత ఏడాది కలెక్టర్ ఆదేశాల మేరకు అదానీ గ్రూప్ 8 పాఠశాలలకు స్మార్ట్ టీవీలను అందజేసిందని, వాటిని ఉపాధ్యాయులు సమర్థవంతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సహకరిస్తున్న అదానీ గ్రూప్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు, ప్రధానోపాధ్యాయులు లక్కి సమ్మయ్య, అదానీ గ్రూప్ ప్రతినిధులు ప్రశాంత్, శివ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించండి

మాజీ ఎంపీపీ కుమార్ గౌడ్ పిలుపు



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్‌పూర్ :** స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎంపీపీ, నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రోళ్ల కుమార్ గౌడ్, జిల్లా నాయకులు గూడ కిరణ్ కుమార్ కోరారు. గురువారం మండలంలోని చాగల్లులో బిఆర్ఎస్ అభ్యర్థుల తరపున వారు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య హయాంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధి పనులే ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపుకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటే అది కేవలం బిఆర్ఎస్ పార్టీ వల్లే సాధ్యమైందని స్పష్టం చేశారు. రాజకీయ స్వార్థం కోసం పార్టీలు మారే ఊసరవెల్లి రాజకీయాలకు కడియం శ్రీహరి నిదర్శనమని వారు విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు ఆయన తీరును గమనిస్తున్నారని, ఈ ఎన్నికల్లో ఆయనకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కారు గుర్తుకే ఓటు వేసి, అభివృద్ధిని కొనసాగించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మహిళా నాయకురాలు మట్లపల్లి సునీత రాజు, బండి కుమార్ గౌడ్, సునీత, ముప్పిడి సాంబ, బీఆర్ఎస్ కార్యకర్తలు, వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్‌పూర్ :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని లింగాల ఘనపురం మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 11, 12 వార్డులలో పర్యటించిన ఆయన, ఆయా వార్డుల ముఖ్య నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలని కోరారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం సుమారు 50 కోట్ల రూపాయల నిధులతో ముమ్మరంగా సాగుతున్న అభివృద్ధి పనులే కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు సోపానాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి 'కడియం మార్క్' అభివృద్ధిని, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలవాలని, ప్రభుత్వం చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వంశీధర్ రెడ్డితో పాటు కొల్లూరి శివ కుమార్ (జనగామ మార్కెట్ వైస్ చైర్మన్, లింగాల ఘనపురం మండల అధ్యక్షులు), వివిధ వార్డుల ఇంచార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. అండగా ఉంటా



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మున్సిపల్ ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ 9వ వార్డు అభ్యర్థి ఏపూరి రమణ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని 9వ వార్డు పాత డోర్నకల్, బాపూజీ నగర్ లో ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. నియెజకవర్గ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ వార్డు అభివృద్ధి కోసం కోటి రూపాయలు నిధులు తెచ్చి సైడు కాలువలు, రోడ్లు నిర్మించి ప్రగతి పథంలో తీసుకువెళుతానన్నారు. తనను గెలిపిస్తే 9వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రచారంలో మార్కెట్ డైరెక్టర్ సాధనాలు వెంకటేశ్వర్లు, గండి రామ్మోహన్, మామిడి నాగరాజు, మనోజ్, ఏపూరి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడు గణేష్‌కు అభినందనలు



**వరంగల్ వాయిస్, జనగామ :** జాతీయ ఉపాధ్యాయ సంఘం (ఎన్ సీటీయూ) ఆధ్వర్యంలో వరంగల్ నిట్ లో నిర్వహించిన 'నేషనల్ మిషన్ ఫర్ మెంటరింగ్' రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో జనగామ జిల్లా వెల్ది మోడల్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు కందగట్ల గణేష్ పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ ఆయనను ఘనంగా అభినందించారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ, ఈ ప్రతిష్టాత్మక శిక్షణకు జనగామ జిల్లా నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడు గణేష్ కావడం విశేషమని కొనియాడారు. జాతీయ విద్యా విధానం-2020ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ శిక్షణ ఉపాధ్యాయులకు మెంటర్‌గా వ్యవహరించే అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. గణేష్ వంటి నిబద్ధత గల ఉపాధ్యాయుడు తమ పాఠశాలలో ఉండటం వెల్ది మోడల్ స్కూల్‌కు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గడ్డం జయశ్రీ, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొని గణేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# బీఆర్ఎస్ తోనే అభివృద్ధి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే డోర్నకల్ మున్సిపల్ అభివృద్ధి పనులు జరిగాయని ఆ పార్టీ 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కాలా మౌనిక యశోదర్ జైన్, 8వ వార్డు అభ్యర్థి గుగులోత్ రాము అన్నారు. పట్టణంలోని 10వ వార్డు, 8వ వార్డులలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.20 కోట్ల నిధులతో పట్టణంలో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. బైపాస్ లో సెంట్రల్ లైటింగ్,ఎన్టీఆర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్ల,సైడ్ కాలువలు నిర్మాణం, ఆహ్లాద వాతావరణంలో సేద తీరేందుకు బంధం చెరువులో పార్క్, ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్,చెరువుకు లిఫ్ట్ ద్వారా నీటి పంపిణీ, మిషన్ భగీరథ ద్వార నీటి పంపిణీ, రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఏడాది బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటన్నింటికీ చరమ గీతం పాడారని, ప్రజలు వీటిని గమనించి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# చిన్నారి రిషితను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రానికి చెందిన యువ నాయకులు, వార్డు మెంబర్ నక్క రాజేందర్-లావణ్య దంపతుల కుమార్తె చిన్నారి రిషిత నూతన వస్త్ర పుష్పాలంకరణ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. రాజేందర్ కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించిన ఆయన, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కల్పన-కృష్ణమూర్తి, దమ్మన్నపేట సర్పంచ్ నవీన్, బీఆర్ఎస్ నాయకులు జాకీర్, ప్రసాద్, కుమార్, శ్రీను, సంపత్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అబద్ధపు హామీలే ఆ పార్టీని బొందపెడతాయి

◆ పరకాల ప్రచారంలో చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలే ఆ పార్టీ రాజకీయ పతనానికి దారితీస్తాయని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధ్వజమెత్తారు. పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని 6, 7, 8, 9, 10, 11, 20, 21 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ వారు ఇంటింటి ప్రచారం, స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పరకాల గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చి, సకల వసతులతో అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా స్థానిక ఎమ్మెల్యే పరకాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, కనీసం తట్టెడు మట్టి కూడా పోయని దుస్థితి నెలకొందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకు ఇప్పుడు రంగులు వేసుకుని తమవేనని కాంగ్రెస్ నేతలు గప్పాలు కొట్టుకుంటున్నారని, పాత శిలాఫలకాలను ధ్వంసం చేయడం వారి దుర్మార్గ రాజకీయానికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రకటించిన 'ఆరు గ్యారెంటీలు' ఎక్కడపోయాయని వారు ప్రశ్నించారు. "200 యూనిట్ల ఉచిత విద్యుత్ లేదు, రూ.500 గ్యాస్ సిలిండర్ అడ్రస్ లేదు. రుణమాఫీ కాలేదు, మహిళలకు రూ.2500 ఊసే లేదు. ఇది ప్రజాపాలన కాదు.. పర్సంటేజీల పాలన" అని నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. పరకాల గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కో-ఆర్డినేటర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు, ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాగుర్లకు అభినందనల వెల్లువ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాగుర్ల వెంకటేశ్వర్ రావుకు ఆరె కుల సంఘం నాయకులు ఘనంగా అభినందనలు తెలిపారు. గురువారం హన్మకొండలో ఆరె సంఘం అధ్యక్షుడు సింధే రామరావు, కోశాధికారి హింగే రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వెంకటేశ్వర్ రావు ఎల్లప్పుడూ రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నారని కొనియాడారు. డీలర్ల సంక్షేమంతో పాటు రైతులకు నాణ్యమైన సేవలందించడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నాగుర్ల శంకర్ రావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోర్తాల చందర్ రావు, హనుమకొండ మండల అధ్యక్షుడు ఆడగాని శివాజీ, సెక్రటరీ కొల్లూరి రవీందర్ రావు, కార్యవర్గ సభ్యులు మారుజోడు నరసింహరావు, కుసుంబ సాంబశివరావు, డి.అంజాజీ, ట్రస్ట్ సభ్యులు మోరే ఆగయ్య, వాడికారి రాజు, నాయకులు బాసిరి నీతాజీ, లడే గోపాల్, ఆనంద్ రావు, సురావు నర్సింగరావు, లోనే దీపక్, మోరే రాజు తదితరులు పాల్గొని నాగుర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బాధితులకు అండగా ఉంటాం



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలో వివిధ కారణాలతో మృతి చెందిన పలువురు కార్యకర్తలు, గ్రామస్తుల కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పులుకుర్తి గ్రామానికి చెందిన బెల్లం బుచ్చి మల్లయ్య ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందడంపై చల్లా ధర్మారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కష్టకాలంలో పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని ఊరుగొండ మరియు దామెర గ్రామాలలో పర్యటించి, ఇటీవలే మృతి చెందిన ముత్యాల రామన్న గౌడ్, పోతుల వీరలక్ష్మి కుటుంబాలను పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ యాత్రలో చల్లా ధర్మారెడ్డి వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో బీసీ సబ్ ప్లాన్ ప్రకటించాలి

• ప్రొఫెసర్ మురళీ మనోహర్ డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు ప్రత్యేకంగా 'సబ్ ప్లాన్' ప్రకటించాలని బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నక్కలగుట్టలో బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే సబ్ ప్లాన్‌ను అమలు చేయాలని కోరారు. రాబోయే బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం కనీసం 20 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, రిజర్వేషన్లు ఖరారు చేయకుండానే ఎన్నికలు నిర్వహించడం అన్యాయమని కేయూ బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గడ్డం కృష్ణయ్య విమర్శించారు. ప్రొఫెసర్ ఎం.సారంగపాణి, ప్రొఫెసర్ గోపు సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన 12 బడ్జెట్‌లలో బీసీలకు 3 శాతం కంటే తక్కువ నిధులు కేటాయించారని, కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం లేదని మండిపడ్డారు. దీనివల్ల కుల వృత్తిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబీసీ నాయకులు డాక్టర్ పాలడుగుల సురేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహించిన కులగణన నివేదికను, ఆయా కులాల వెనుకబాటుతనానికి సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సబ్ ప్లాన్ డ్రాఫ్ట్ విడుదల: ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్ రూపొందించిన "బీసీ సబ్ ప్లాన్ డ్రాఫ్ట్"ను నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ఎదునూరి రాజమౌళి, ధారబోయిన సతీష్, డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్, డాక్టర్ కత్తెరశాల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో 7న మెగా జాబ్ మేళా

**• పోస్టర్ ఆవిష్కరించిన వీసీ ప్రతాప్ రెడ్డి**



**వరంగల్ వాయిస్,కేయూ క్యాంపస్ :** నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం కల్పిస్తూ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈనెల 7వ తేదీన భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. కేయూ ప్లేస్‌మెంట్ సెల్, హైదరాబాద్ మేజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్తంగా 'సీ.ఐ.ఎస్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్' ఆధ్వర్యంలో ఈ మేళాను నిర్వహిస్తున్నాయి. బుధవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం కలిసి ఆవిష్కరించారు. శనివారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు కేయూ ఆడిటోరియంలో ఈ ఎంపిక ప్రక్రియ జరుగుతుందని ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ చిర్రా రాజు తెలిపారు. ఈ మేళా ద్వారా మొత్తం 400 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, వారికి తక్షణమే నియామక పత్రాలను అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్ కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుంది. 2023, 2024, 2025లో ఉత్తీర్ణులైన వారు మరియు 2026లో పాస్ అవుట్ కాబోయే విద్యార్థులు ఈ మేళాకు హాజరుకావచ్చు. అర్హత కలిగిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీసీ కోరారు. ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఆచార్యులు బి.సురేష్ లాల్, రాజేంద్ర కట్ల, ఎస్.నరసింహ చారి, మామిడాల ఇస్తారి, వై.వెంకయ్యలతో పాటు ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు డాక్టర్ సంతోష్, బొల్లం కిరణ్, మేజిక్ బస్ ఫౌండేషన్ ప్రతినిధులు రాకేష్ ల్యాదేల్ల, నందేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# 9న 'సీఎం కప్' జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ ఎంపికలు

**• కరీమాబాద్‌లోని బ్రిలియంట్ హై స్కూల్‌లో నిర్వహణ**
**• అసోసియేషన్ అధ్యక్షుడు మణికంఠ**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సీఎం కప్' రెండో ఎడిషన్‌లో భాగంగా వరంగల్ జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ జట్ల ఎంపికలను ఈనెల 9న నిర్వహించనున్నారు. ఈ మేరకు వరంగల్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గడదాసు మణికంఠ, జిల్లా యువజన, క్రీడా అధికారి అనిల్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ కైలాస్ యాదవ్ సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రిలియంట్ హై స్కూల్, కరీమాబాద్, వరంగల్ లో ఫిబ్రవరి 9న ఈ ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి , అర్హత కలిగిన జిల్లాలోని కిక్ బాక్సింగ్ క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. ఈ జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వరంగల్ జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారని, వారు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని మణికంఠ తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల కిక్ బాక్సింగ్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సీఎం కప్ ద్వారా క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం ఈ చక్కని వేదికను కల్పిస్తోందని, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన అంబాల రాజు–స్వప్న



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** జమ్మికుంట మండలం బిజిగిర్ షరీఫ్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రాచపల్లి రాజేందర్–సాజిదా పర్వీన్ దంపతుల కుమార్తె సుదీప్తి (సోనియా) వివాహ వేడుక గురువారం జమ్మికుంట పట్టణంలో ఘనంగా జరిగింది. పట్టణంలోని స్వాతి గార్డెన్స్‌లో అంగరంగ వైభవంగా జరిగిన సుదీప్తి–డేవిడ్ ల వివాహ మహోత్సవానికి జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు–స్వప్న దంపతులు హాజరయ్యారు. నూతన వధూవరులను పూలమాలలతో అభినందించి, అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న ఈ జంట నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వివాహ వేడుకలో పలువురు రాజకీయ నాయకులు, పాత్రికేయ మిత్రులు, బంధుమిత్రులు పాల్గొని నూతన దంపతులకు శుభాశీస్సులు అందజేశారు.

# రేపు కేయూలో 'ఓరియంటేషన్' ప్రోగ్రాం

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం మరియు హైదరాబాద్ టీ–హబ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేక ఓరియంటేషన్ సెషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 6న ఉదయం 9:30 గంటలకు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వారిలో వ్యాపార దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సెషన్ నిర్వహించబడుతోంది. రూసా నోడల్ ఆఫీసర్ ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి, కే–హబ్ డైరెక్టర్ ఆచార్య టి.సవితా జ్యోత్స్న ఈ మేరకు వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ చాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం హాజరుకానున్నారు. అలాగే హైదరాబాద్ ఏఐసీ టీ–హబ్ ప్రతినిధులు రాజేష్ కుమార్ అడ్ల, శ్రవణ ఏర్గల, చైతన్య శ్రవణ్, మొహమ్మద్ హాఫీజుద్దీన్ విద్యార్థులకు దిశానిర్దేశం చేయనున్నారు.

# 'పూలే, అంబేద్కర్, సేవారత్న' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బహుజన సాహిత్య అకాడమీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది అందించే వివిధ జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక, సాహిత్య, ప్రజా సేవా రంగాల్లో విశేష కృషి చేసిన వారిని గుర్తించి ఈ పురస్కారాలను అందజేయనున్నారు. ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో మార్చి 15, 2026న నిర్వహించే బహుజన సాహిత్య అకాడమి 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డుల ప్రధానోత్సవం జరుగుతుంది. ఈ సదస్సుకు దక్షిణ భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఉదయం సెషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చా వేదిక, మధ్యాహ్నం అవార్డుల ప్రదానం ఉంటుంది. మహాత్మా జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్, ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డులతో పాటు సేవారత్న, సాహిత్య రత్న, విద్యారత్న, ఉత్తమ సర్పంచ్, ఉమెన్ లీడర్‌షిప్ అవార్డులను అందజేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారితో పాటు పూలే, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసే అగ్రకులాల వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి గలవారు తమ వివరాలతో న్యూ శ్రీ ఫ్లెక్స్ ప్రింటింగ్, హనుమకొండ చౌరస్తా నందు లేదా ఫోన్ నంబర్ 9989949653 ద్వారా సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవార్డుల ఎంపిక ప్రక్రియ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ పర్యవేక్షణలో, సెలెక్షన్ కమిటీ సభ్యులు బొమ్మకంటి రాజేందర్ ఆధ్వర్యంలో జరుగుతుంది.

# పుల్ల స్వరూప ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మున్సిపల్ ఎన్నికల రణక్షేత్రంలో భారతీయ జనతా పార్టీ తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పుల్ల స్వరూప విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ శ్రేణులు వార్డును చుట్టేస్తున్నాయి. గురువారం వార్డు ఇంచార్జి, జిల్లా కోశాధికారి ఎర్ర రామన్న నేతృత్వంలో కార్యకర్తలు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యల పరిష్కారం మరియు వార్డును అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించాలంటే బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఎర్ర రామన్న పేర్కొన్నారు. ప్రచారానికి వెళ్లిన చోట మహిళలు, వృద్ధులు అభ్యర్థి పుల్ల స్వరూపకు ఘనస్వాగతం పలుకుతూ తమ మద్దతు తెలియజేశారు. పుల్ల రాజు, సాంబయ్య, ఈశ్వర్, అభిరామ్, లత, దీప, సుజాతతో పాటు బూత్ స్థాయి నాయకులు, వార్డు ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సిబ్బందిపై దాడి

**ఇద్దరిపై కేసు నమోదు**

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు యువకులపై ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ డిపో–2కు చెందిన బస్సు మేడారం నుంచి హనుమకొండకు వస్తుండగా, ఆరేపల్లి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పైడిపల్లికి చెందిన జన్ను కిరణ్, జన్ను సందీప్ అనే ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి బస్సుకు అడ్డంగా నిలిచారు. "మాకే హారన్ కొడతారా?" అంటూ డ్రైవర్, కండక్టర్‌లను కిందకు దిగాలని బెదిరించారు. కండక్టర్ కిందకు దిగగానే అతనిపై విచక్షణారహితంగా దాడి చేశారు. అడ్డుకోబోయిన డ్రైవర్‌పై కూడా చేయి చేసుకున్నారు. యువకుల ఆగడాలను గమనించిన బస్సులోని ప్రయాణికులు వెంటనే స్పందించి వారిని అడ్డుకున్నారు. నిందితులను పట్టుకుని బస్సులోనే ఎక్కించి నేరుగా ఏనుమాముల పోలీస్ స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఉద్యోగుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడినందుకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఏనుమాముల ఇన్స్పెక్టర్ జవ్వాజి సురేష్ తెలిపారు. నిందితులు వాడిన బైక్‌ను సీజ్ చేసి, వారిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# పూర్ణ చారికి మద్దతుగా రాష్ట్ర నేతల ప్రచారం



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మున్సిపల్ ఎన్నికల సమరం ముదురుతోంది. 9వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి బెజ్జంకి పూర్ణ చారి గెలుపును కాంక్షిస్తూ గురువారం వార్డులో విస్తృత ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ గారికి పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు సంయుక్తంగా వార్డులోని గడప గడపకూ తిరుగుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వార్డులో బీజేపీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, అవినీతి రహిత పాలన కేవలం బీజేపీతోనే సాధ్యమని నాయకులు పేర్కొన్నారు. ఈ ప్రచారంలో పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునిరి మేఘనాథ్, మండల అధ్యక్షులు ఉప్పుగుల్ల శ్రీకాంత్ రెడ్డి, నాయకులు ఎరుకల దివాకర్, మాజీ టౌన్ ప్రెసిడెంట్ మార్త భిక్షపతి, కార్పొరేటర్ బైరి శ్రావణ్, సీనియర్ నాయకులు సలుపల సురేష్ యాదవ్, వీరితో పాటు బీజేపీ వార్డు అభ్యర్థులు, శక్తి కేంద్రాల ఇంచార్జ్‌లు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు 'కౌన్సెలింగ్' సేవలు

**యూజీసీ మార్గదర్శకాలతో కమిటీ నియామకం**



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** మారుతున్న సామాజిక పరిస్థితులు, కోవిడ్ అనంతర పరిణామాల దృష్ట్యా విద్యార్థులు, పరిశోధకులు మరియు సిబ్బందిలో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం, యూజీసీ మరియు సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం.. విశ్వవిద్యాలయం మరియు దాని అనుబంధ కళాశాలల్లో మానసిక ఆరోగ్య మద్దతు వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కౌన్సెలర్లను నియమించింది. వైస్–చాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఈ కౌన్సెలింగ్ విభాగంపై సర్క్యులర్ విడుదల చేశారు. ఈ వ్యవస్థను పర్యవేక్షించేందుకు నిపుణులతో కూడిన కమిటీని ప్రకటించారు. చైర్మన్ డాక్టర్ ఎం.స్వర్ణలత (ఆచార్యులు, సోషియాలజీ విభాగం), సభ్యులుగా డాక్టర్ సంపత్ రెడ్డి, డాక్టర్ పి. మాలతి (అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సైకాలజీ విభాగం), మెంబర్ కన్వీనర్ గా అకాడమిక్ విభాగ సహాయ రిజిస్ట్రార్ లను నియమించారు. వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి ఈ కమిటీకి దిశానిర్దేశం చేస్తూ.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఎంత అవసరమో వివరించారు. ఈ కమిటీ కేవలం విద్యార్థులకే కాకుండా బోధన, బోధనేతర సిబ్బందికి కూడా మానసిక ఆరోగ్య కార్యక్రమాల అమలులో సహకరిస్తుంది. ఏదైనా సమస్యలు ఉన్నవారు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

# ఎస్ఆర్ఎస్పీ కెనాల్‌లో విషాదం

- **మస్తాన్ మృతదేహం లభ్యం**
- **సోను కోసం కొనసాగుతున్న గాలింపు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎస్ఆర్ఎస్పి కెనాల్‌లో గల్లంతైన ఇద్దరు వ్యక్తులలో ఒకరైన మస్తాన్ మృతదేహాన్ని ఎస్డీఆర్ఎఫ్ బృందం గురువారం వెలికితీసింది. హసన్‌పర్తికి చెందిన మస్తాన్, సోను అనే ఇద్దరు వ్యక్తులు పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత మంగళవారం కెనాల్‌లో చేతులు కడుక్కోవడానికి దిగి ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందిన వెంటనే మామునూరు నాలుగో బెటాలియన్‌కు చెందిన ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఎస్ఐ వేణు నేతృత్వంలోని 20 మంది సభ్యుల బృందం రంగంలోకి దిగింది. మంగళవారం నుంచి కెనాల్ వెంబడి సుమారు 30 కిలోమీటర్ల మేర ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం కనిపించలేదు. ప్రవాహం ఉధృతంగా ఉండటంతో మృతదేహాలను గుర్తించడం సవాలుగా మారింది. సాధారణ గాలింపుతో మృతదేహాలు లభించకపోవడంతో, ఎస్డీఆర్ఎఫ్ బృందం అధునాతన 'అండర్ వాటర్ సెర్చ్' టెక్నిక్స్‌ను ఉపయోగించింది. గురువారం మధ్యాహ్నం తీగరాజులపల్లి సమీపంలో కెనాల్ అడుగున చిక్కుకున్న మస్తాన్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. గల్లంతైన మరో వ్యక్తి సోను కోసం గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. కఠిన పరిస్థితుల్లో శ్రమించి మృతదేహాన్ని వెలికితీసిన ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని నాలుగో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వ్ ఇన్స్పెక్టర్ రవి, ఉన్నతాధికారులు అభినందించారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన క్యాలెండర్‌ను గురువారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రైతు రక్షణ సమితి నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతు రక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

- **కలెక్టర్ రాహుల్ శర్మ**
- **అధికారులు సమన్వయంతో పనిచేయాలి**



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లాలో ఈ నెల 8న ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, వివిధ శాఖల అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై వారు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. విద్యుత్ & అగ్నిమాపక శాఖ హెలిప్యాడ్ పరిసరాల్లో విద్యుత్ వైర్లను తొలగించి, ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాటు చేయాలి. కొడవటంచ, చెల్పూర్ హెలిప్యాడ్‌ల వద్ద అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలి. వైద్య శాఖ కొడవటంచలో సేఫ్ హౌస్, చెల్పూర్ సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. ఆయుష్ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు సిద్ధం చేయాలి. ఆర్ అండ్ బీ హెలిప్యాడ్ పనులు పూర్తి చేసి, సభా ప్రాంగణం వద్ద పటిష్టమైన బారికేడింగ్ నిర్మించాలి. రవాణా , ఆర్టీసీ సీఎం కాన్వాయ్ వాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసి, అనుభవజ్ఞులైన డ్రైవర్లను కేటాయించాలి. దేవాదాయ శాఖ కొడవటంచ ఆలయంలో వీఐపీ ప్రోటోకాల్ పాటించాలి. ఆలయ విశిష్టతను తెలిపే నివేదికను సిద్ధం చేయాలి. చెల్పూర్ పబ్లిక్ మీటింగ్ వద్ద ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వీఐపీలు, సిబ్బంది, వాహనాల పాసుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎస్పీ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, విద్యుత్ ఎస్ఈ మల్చూర్ నాయక్, డీఆర్డీఓ బాలకృష్ణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రమాదేవికి అంతర్జాతీయ గౌరవ డాక్టరేట్

**సామాజిక సేవలకు గుర్తింపుగా పురస్కారం**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ రంగంపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త డా.ఎస్.రమాదేవి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక సేవా రంగాలలో ఆమె చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ ఆమెకు గౌరవ డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక ఘనమైన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య యేషీ ఫుంట్సోక్ (టిబెటన్ పార్లమెంట్ మాజీ ఉపసభాపతి), డా.ఈషా అగర్వాల్ (మిస్ మార్వెలస్ ఇండియా – 2025), డా.అనిల్ కుమార్ (డైరెక్టర్, నేషనల్ ఆర్గన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్, భారత ప్రభుత్వం) హాజరై రమాదేవి గారికి డాక్టరేట్‌ను అందజేసి ఘనంగా సత్కరించారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి, మరియు మానవ హక్కులపై సమాజంలో అవగాహన కల్పించడంలో డా. రమాదేవి సుదీర్ఘ కాలంగా శ్రమిస్తున్నారు. ఆమె చేసిన ఈ నిరంతర కృషి దేశవ్యాప్తంగా ప్రశంసనీయమని కమిషన్ ప్రతినిధులు, అతిథులు కొనియాడారు. ఈ సందర్భంగా డా.ఎస్.రమాదేవి మాట్లాడుతూ.. తనకు లభించిన ఈ అంతర్జాతీయ గౌరవాన్ని సమాజ సేవ కోసం అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపారు. రమాదేవికి దక్కిన ఈ గుర్తింపు వరంగల్ జిల్లా ప్రతిష్ఠను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ఇనుమడింపజేసిందని పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# విజయమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి

**12 వార్డుల నేతలతో ఎమ్మెల్యే సమీక్ష**



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** రాబోయే మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఎన్నికల వ్యూహానికి పదును పెట్టారు. గురువారం వర్ధన్నపేట టౌన్‌లోని ఎన్నికల కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల అభ్యర్థులు, వార్డు ఇంచార్జులు మరియు ముఖ్య నాయకులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలంటే క్షేత్రస్థాయిలో ఐక్యత అత్యంత అవసరమని పేర్కొన్నారు. అభ్యర్థులు, ఇంచార్జులు సమన్వయంతో పని చేస్తూ ప్రతి ఇంటికి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు సమగ్రంగా వివరించాలని పిలుపునిచ్చారు. "ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా పనిచేయాలి. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు నా దృష్టికి తీసుకురండి, పరిష్కారానికి నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని ఎమ్మెల్యే నాయకులకు భరోసా ఇచ్చారు. ఐక్యమత్యంతో ముందుకు సాగితే విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట మున్సిపాలిటీకి చెందిన ముఖ్య నాయకులు, అభ్యర్థులు, వార్డు ఇంచార్జులు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- **12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె**
- **గుమాస్తా కార్మికుల కనీస వేతనం చెల్లించాలి**
- **ఏఐసీటీయూ నేత ముక్కెర రామస్వామి**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేసి, పాత కార్మిక చట్టాలనే కొనసాగించాలని ఆల్ షాప్ గుమాస్తాల సంఘం జిల్లా అధ్యక్షులు, ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. 2026 ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ వరంగల్ చౌరస్తాలోని వివిధ షాపింగ్ మాల్స్ గుమాస్తాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కెర రామస్వామి మాట్లాడుతూ, వందల ఏళ్ల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. వాటి స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కేవలం కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. ఈ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికులకు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు మరియు వేతనాలు అడిగే స్వేచ్ఛ ఉండదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. షాపింగ్ మాల్స్ మరియు వివిధ దుకాణాల్లో పనిచేసే గుమాస్తా కార్మికులకు నెలకు ₹26,000 కనీస వేతనం చెల్లించాలి. రోజుకు 8 గంటల పని దినాలను ఖచ్చితంగా అమలు చేయాలి. బోనస్, సర్వీస్ ఎస్–ఫామ్ వంటి ప్రయోజనాలు కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి. రాష్ట్ర కార్మిక సంఘాలు, కేంద్ర ఫెడరేషన్ల పిలుపు మేరకు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో వరంగల్ జిల్లాలోని గుమాస్తా సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.భాస్కర్, ఎం.ప్రకాష్, బి.సతీష్, కె.శ్రీనాథ్, ఆర్.సుధాకర్, డి.లావణ్య, టి.జ్యోతి, ఇతర గుమాస్తా కార్మికులు పాల్గొన్నారు.

# బన్సాలీ మూవీ..
# దో దీవానే షెహర్ మే



బాలీవుడ్ స్టార్ నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'దో దీవానే షెహర్ మే'. ఈ చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా చిత్రయూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అరేంజ్డ్ మ్యారేజ్ సెటప్‌లో కలిసిన ఇద్దరు వ్యక్తులు (శశాంక్ మరియు రోష్ని) మధ్య చిగురించిన ప్రేమ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. శశాంక్ (సిద్ధాంత్) తన ఉచ్చారణ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రోష్ని (మృణాల్) తన అందం విషయంలో బాధపడుతూ ఉంటుంది. ఇద్దరు అసంపూర్ణమైన వ్యక్తులు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకున్నారనేదే ఈ సినిమా. నేటి తరం యువత ప్రస్తుతం ఎదుర్కొంటున్న అభద్రతా భావం, ఒత్తిడి, నిజమైన ప్రేమ వెతుకులాటను ప్రతిబింబించేలా ఈ సినిమాను దర్శకుడు రవి ఉద్యావార్ తెరకెక్కించాడు. తెలుగులో 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతోనే బాలీవుడ్‌కు పరిచయం అవుతుండటం విశేషం. భన్సాలీ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో ఇలా అరుణ్, జాయ్ సేన్ గుప్తా కీలక పాత్రలు పోషించారు.




# ఓటీటీలోకి రాజాసాబ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో వచ్చిన క్రేజీ హారర్ `కామెడీ మూవీ 'ది రాజాసాబ' ఓటీటీలోకి రాబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం విడుదలైన నెల రోజుల్లోపై ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జియో హాట్‌స్టార్ అత్యంత భారీ ధరకు ఈ సినిమా హక్కులను సొంతం చేసుకోగా.. ఫిబ్రవరి 6 నుంచి ఈ సినిమా జియో హాట్‌స్టార్‌లో తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే ఓటీటీ వెర్షన్‌కి సంబంధించి గుడ్ న్యూస్ తెలిపింది చిత్రయూనిట్. ఈ సినిమా ఎక్స్‌టెండెడ్ కట్‌తో ఓటీటీలోకి రాబోతున్నట్లు ప్రకటించింది. దీంతో థియేటర్‌లో మిస్ అయిన ప్రేక్షకులకి ఇది గుడ్ న్యూస్ అని చెప్పవచ్చు. ప్రభాస్‌ను వింటేజ్ లుక్‌లో చూపిస్తూ మారుతి తెరకెక్కించిన ఈ చిత్రంలో సంజయ్ దత్, మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ ముఖ్య పాత్రలు పోషించారు.

---




# మరో జన్మంటూ ఉంటే..
## దర్శకుడిగా మాత్రం పుట్టను.. గుణశేఖర్

బలమైన కథలు, భారీ సెట్స్‌లకు పెట్టింది పేరు దర్శకుడు గుణశేఖర్. 'బాల రామాయణం' 'చూడాలని ఉంది', 'ఒక్కడు'లాంటి సినిమాలతో సత్తా చాటిన ఆయన ఇప్పుడు ఈతరం కథతో 'యుఫోరియా' ను తెరకెక్కించారు. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా 'మరో జన్మంటూ ఉంటే దర్శకుడిగా పుట్టను' అని ఇటీవల వ్యాఖ్యానించారు. 'డైరెక్టర్‌గా ప్రతిభ చాటిన మీరు అలా ఎందుకు అనాల్సి వచ్చింది? ట్రోలింగ్ కారణమా?' అని గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఓ విలేకరి ప్రశ్నించగా.. గుణశేఖర్ సమాధానమిచ్చారు.ట్రోలింగ్ సమస్య కాదు. అది ఎప్పుడూ ఉంటుంది. ఓ దర్శకుడి ఒత్తిడి గురించి చెబుతూ ఆ మాట అన్నాను. డైరెక్టర్ సీటులో కూర్చున్న ఎవరికైనా స్ట్రెస్ తప్పదు. ఏ ఉద్యోగంలోనైనా తృప్తి ఉంటుందిగానీ దర్శకులకు ఉండదు.తృప్తి ఉంటేనే కంటినిండా నిద్రపడుతుంది. అలాంటి నిద్రను 1992లో వదిలేసిన నేను ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నా. మళ్లీ హాయిగా వచ్చే జన్మలోనే నిద్రపోవాలన్న ఉద్దేశంతో డైరెక్టర్‌గా పుట్టను అని అన్నాను' అని వివరణ ఇచ్చారు. భూమిక, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. తాజా ప్రెస్‌మీట్‌లో భూమిక, గుణశేఖర్ కుమార్తె, నిర్మాత నీలిమ గుణ తదితరులు పాల్గొన్నారు. విలేకరులతో 'యుఫోరియా' టీమ్ పంచుకున్న విశేషాలివీ.. హైదరాబాద్‌లో జరిగిన ఓ సంఘటనను యథాతథంగా తెరపైకి తీసుకొచ్చారన్న టాక్ వినిపిస్తోంది. ముందుగా కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీయాలని నిర్ణయించుకున్నా. కానీ, కథ రాయడం మొదలుపెట్టాక అన్ని నగరాల్లోనూ, విదేశాల్లోనూ అలాంటి ఘటనలు జరిగాయి. ఈ సినిమాలోని సీన్స్ వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలను గుర్తుచేస్తాయన్నారు.



# అట్లీ, అల్లు అర్జున్ మూవీలో
# రష్మిక హీరోయిన్
## అంటూ ప్రచారం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం ఎఎ22 ఇప్పటికే సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, దీనిపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. సినిమా గురించి చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో నటించే హీరోయిన్‌ల గురించి మరో క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మరో ముగ్గురు కథానాయికలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన పేర్లు ప్రముఖంగా వినిపించగా, ఇప్పుడు రష్మిక మందన నిజంగానే షూటింగ్‌లో జాయిన్ అయిందన్న వార్త మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటోందని, అల్లు అర్జున్, జాన్వీ కపూర్, 'కుబేర' ఫేమ్ జిమ్ సర్భలతో కలిసి కీలక సన్నివేశాల్లో నటిస్తోందని ఓ ఆంగ్ల మీడియా ఛానల్ వెల్లడించింది. దాదాపు నెల రోజుల పాటు కొనసాగే ఈ షెడ్యూల్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నట్లు సమాచారం. రమ్యకృష్ణ, యోగిబాబు వంటి ప్రముఖ నటీనటులు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో విజయ్ దేవరకొండ,రష్మిక మందన పెళ్లి వార్తలు కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండటంతో ఈ మూవీపై మరింత ఆసక్తి పెరిగింది. 'పుష్ప' సిరీస్‌లో అల్లు అర్జున్ , రష్మిక జంట బ్లాక్‌బస్టర్ హిట్ ఇవ్వడంతో ఈ కాంబో మళ్లీ రిపీట్ అవుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ చిత్రంలో రష్మిక నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆమె కెరీర్‌లో చేయని సరికొత్త పాత్రలో, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యూనివర్స్ కాన్సెప్ట్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కుతుండగా, అల్లు అర్జున్ మల్టిపుల్ క్యారెక్టర్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం.





# మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

- ముఖ్య అతిథిగా హాజరైన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- మొదటి రోజు ఆదాయం రూ. 2.49 కోట్లు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని తిరుమల, తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో మేడారం సమ్మక్క–సారక్క వనదేవతల హుండీ లెక్కింపు కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, మేడారం జాతరకు దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తులు సమర్పించిన కానుకల పూర్తిస్థాయి భద్రతా చర్యలు, పారదర్శక విధానాలతో లెక్కించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. 200 మంది అధికారులు, 300 మంది వాలంటీర్లతో భారీ భద్రత మధ్య కౌంటింగ్ ప్రక్రియ సాగుతోందన్నారు. హుండీ లెక్కింపు ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో, సంబంధిత అధికారుల సమక్షంలో నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసానికి ఎలాంటి లోటు లేకుండా, ప్రతి రూపాయి జాగ్రత్తగా లెక్కించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. అంగరంగ వైభవంగా నిర్వహించిన మేడారం జాతరలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 828 హుండీలను దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిందన్నారు. కౌటింగ్ ప్రక్రియ పది రోజుల పాటు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఓడిబియ్యం, బెల్లం, కొబ్బరి నీళ్లతో కరెన్సీ తడిచినందున వాటిని లెక్కించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా మొదటి రోజు 125 హుండీలు లెక్కించగా రూ.2.50 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడు భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగినందున ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత, ఆదివాసీ పూజారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్టేషన్ ఘనపూర్ నా పుట్టినిల్లు

- ఇక్కడ అభివృద్ధి చేయడం నా బాధ్యత
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ నా పుట్టినిల్లు.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం నా బాధ్యత అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చాకే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రం చాగల్ పరిధిలోని 6,7,8,9 వార్డులలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కడియం కావ్య ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. స్టేషన్ ఘనపూర్‌కు మున్సిపాలిటీ హోదా రావడంతోనే అభివృద్ధి ప్రారంభమైందన్నారు. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. మున్సిపాలిటీ ఏర్పడిన వెంటనే కడియం శ్రీహరి రూ.50 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు ప్రారంభించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థులకు స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన అభ్యర్థులన్నారు. వారిని గెలిపిస్తే మరింత వేగంగా అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు అభ్యర్థి కనకం రమేష్, 7వ వార్డు అభ్యర్థి అన్నపు సుమలత, 8వ వార్డు అభ్యర్థి చాతర బోయిన సత్యనారాయణ, 9వ వార్డు అభ్యర్థి సౌదరపల్లి సంపత్ రాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య–శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, వార్డు అబ్జర్వర్లు, ఇంచార్జిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వేలేరులో కడియం శ్రీహరి..

వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదిక, ధర్మసాగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలేరు మండలానికి సంబందించిన 26 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.26,03,016 విలువగల చెక్కులను, ధర్మసాగర్ మండలానికి సంబందించిన 69 మంది లబ్ధిదారులకు రూ.69,08,004 విలువగల చెక్కులను అలాగే కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఆరుగురు కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.6,00,696 విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో, సంక్షేమ పథకాల అమలులో మీ అందరి సహకారం అవసరమని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





# మంత్రికి సమ్మక్క బంగారం అందజేత

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అమ్మవారిపేటలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర విజయవంతమైంది. బుధవారం అత్యంత వైభవంగా తిరుగువారం నిర్వహించారు. ఈ మేరకు 40 వ డివిజన్ లో గురువారం నిర్వహించిన వివిధ అభివృద్ధి పనుల్లో పాల్గొనేందుకు మంత్రి కొండా సురేఖ హజరయ్యారు. దీంతో మంత్రిని అమ్మవారిపేట సమ్మక్క–సారలమ్మ జాతర ఆర్గనైజర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దాసి రామ్‌దేవ్, అఖిల్ కలిసి అమ్మవారి బంగారాన్ని అందించారు.



# 2028 మహాజాతరకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు
- మేడారం జాతర రహదారుల పరిశీలిన

**వరంగల్ వాయిస్, తాడ్వాయి :** మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లు, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గురువారం సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.ఎస్.శ్రీనివాసరాజు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి మేడారంలో పర్యటించారు. వీవీఐపీ వాహనాలు వచ్చే రహదారులు, పార్కింగ్ స్థలాలు, తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన శ్రీనివాసరాజు.. జాతర సమయంలో వీవీఐపీ వాహనాల రాకపోకల్లో ఎదురయ్యే ఇబ్బందులను, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2026 మహా జాతరలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, 2028 జాతర నాటికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఇటీవల ముగిసిన జాతరను విజయవంతం చేయడంలో కృషి చేసిన అన్ని శాఖల అధికారులను ప్రిన్సిపల్ సెక్రెటరీ అభినందించారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బీ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల కన్నా బీసీ వాదం గొప్పది

☐ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ దుస్స శివశంకర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న మున్సిపాలిటీ ఎన్నికల పోరులో బీపీ జాతి బిడ్డలు చైతన్యమై, పోటీలో ఉన్న బీసీ కులస్తులకు మీరు ఓట్లు వేయడంతోపాటు ఇతర సోదర కులస్తులతో ఓట్లు వేయించి బీసీల గౌరవాన్ని, కీర్తిని నిలబెట్టాలని తెలంగాణ పద్మశాలి సంఘం స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ దుస్స శివశంకర్ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీల రంగులు మీరు వేసుకొని బీసీలను, బీసీ వాదాన్ని ఓడించవద్దన్నారు. రాజ్యాధికారంలో మన బీసీ జాతి చాలా వెనుకబడి ఉందన్నారు. అది గమనించి సమాలోచనలు చేసి ఇప్పుడు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీసీ అభ్యరులను గెలిపించుకోవాలన్నారు. మీకు ఎల్లవేళల అందుబాటులో ఉండే వ్యక్తిని, బీసీల సమస్యలపై, స్థానిక అభివృద్ధిపై స్పందించే వ్యక్తిని కౌన్సిలర్ గా ఎన్నుకోవాలన్నారు. మనకు బీజీ వాదమే గొప్ప అన్నారు. తర్వాతే రాజకీయ పార్టీలు, స్నేహితులు అన్నారు. దూర దృష్టితో భవిష్యత్తును ఊహించి మన బీసీలను గెలిపించుకోవాలని శివశంకర్ కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com